# గోరంత దీపం

ఇంట్లో ఏం తోచక గేటు దగ్గరికి వచ్చి వీధిలోకి చూస్తూ నిలుచుంది సంధ్య.

పక్కింటి కిట్టు ఈ మధ్య నడకతో పాటు మెల్లిగా ఇనుపచువ్వల గేటు పాకి కొక్కెం తీయడం నేర్చుకొన్నాడు. వాడు గేటు తెరుచుకుని రోడ్డుమీదికి వచ్చి పరిగెత్తడం మొదలు పెట్టాడు.

కార్లతో, బస్సులతో మరీ రద్దీగా ఉండే రోడ్డు కాకపోయినా రిక్షాలు, ఆటోలు హడావిడిగా తిరుగుతునే ఉంటాయి.

'వాడు వీధిలోకి వచ్చేయడం వాళ్ళమ్మ గమనించనట్టుంది! మహాలోకపు మనిషి! ఏం పనిలో మునిగిపోయిందో!' అని సంధ్య అనుకొంటూండగానే ఎదిరింటి మరమ్మత్తుకి వస్తున్న ఇసుక లారీకి ఎదురుగా పరిగెత్త సాగాడు కిట్టూ.

అయ్యో! వాడు లారీకింద పడేట్టున్నాడే?" సంధ్య దడదడలాడే గుండెలతో పరిగెత్తింది. సంధ్య మెరుపులా వెళ్ళి లాగడం వల్ల కిట్టుకు వెంట్రుక వాసిలో అపాయం తప్పింది.

"మీ అబ్బాయా? ఇంత అజాగ్రత్తగా రోడ్డుమీదకి వదిలేస్తే ఎట్లా?" సడెన్ బ్రేక్‌తో బండి ఆపిన డ్రైవరు ఆమె జవాబు కోసం చూడకుండానే బండిస్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయాడు.

కిట్టుని ఎత్తుకొని వచ్చి చూసేసరికి, కిట్టువాళ్ళమ్మ దొడ్లో బట్టలుతుకుతూ కనిపించింది.

"భలేదానివే, లలితా! పిల్లాడు ఏం చేస్తున్నాడో, ఎక్కడున్నాడో కూడా చూసుకోవా?" కోపంగా అడిగింది సంధ్య.

"మీ ఇంట్లోకివచ్చి ఏమన్నా పడేశాడా?" గాబరాగా అడిగింది లలిత.

"పసివాడు తెలియక పడేస్తే నీతో షికాయత్ చేయడానికి వస్తానా? నేను చూశాను కాబట్టి సరిపోయింది. లేకపోతే వాడు ఈ పాటికి లారీ చక్రాల కింద నలిగి ఉండేవాడు!" జరిగిన సంఘటన చెప్పింది సంధ్య.

"నా బాబే! ఎంత గండం తప్పిందిరా నీకు!' అని ఆ తల్లి వాడిని తీసుకొని అక్కున చేర్చుకోవడానికి బదులు వాడిని సంధ్య చంకలోంచి లాగి దభీ దభీమని నాలుగు గుద్దులు గుద్దింది లలిత, వాడి చిన్న వీపుమీద!

"అరే! వాడిని కొడుతున్నావేమిటి?" తెల్లబోయింది సంధ్య.

"కాకపోతే, వీడు చేసిన పనేమిటి? ఆటవస్తువులు ముందు పడేసి 'ఆడుకోరా' అని, బట్టలుతుక్కోవడానికి వస్తే వీడు గేటు తెరుచుకొని వీధిలోకి పరిగెడతాడా?"

మరి రెండు వేయబోతే సంధ్యే తప్పించింది.

"భలేదానివే! పసివాడు! వాడికేం తెలుసు? నువ్వే జాగ్రత్తగా చూచుకోవాలి!"

"ఎంతని జాగ్రత్తగా చూస్తానండీ? ఎప్పుడూ మెడకు కట్టుకు కూర్చోనా? అలా కూర్చుంటే ఇంట్లో బండెడు చాకిరీ ఎవడు చేస్తాడు? పాడు పిల్లలు! పుట్టపోతేనే హాయి!" లలిత తన విసుగునీ, కోపాన్నీ వెళ్ళబోస్తుంటే ఈసారి మరింత తెల్లబోయింది సంధ్య.

"పిల్లలు లేరని మీరెందుకు బాధపడతారో తెలియదు! కని మేం ఏం ఆనందపడిపోతున్నామని? పొద్దునలేస్తే పిల్లల సుస్తీలు, డాక్టర్ల దగ్గరికి పరిగెత్తటాలు, మందులు, పిల్లకి మూడోనెల వచ్చీ రాగానే నెల తప్పడాలు, నీరసాలు, టానిక్కులూ వీటికితోడు చాలీ చాలని జీతాలు–ఇది ఎంత నరకమో మీకు తెలియక వాపోతున్నారు! నేను అనుభవంతో చెబుతున్నాగా? మీరెంతో అదృష్టవంతులు! చీకూ చింతా లేకుండా గడిపేయవచ్చు మీ రెండు జీవితాలు!"

"రెండు మూడైతే మూడు నాలుగైతేనే అందం, ఆనందం, లలితా!"

"మీరంత పిల్లలకోసం తపించిపోతుంటే ఇప్పుడు పిల్లపుట్టినా, పిల్లాడు పుట్టినా, మీకిచ్చేస్తాను. పెంచుకోండి, వదినగారూ!"

"నిజంగా ఇస్తావా?"

"సంతోషంగా ఇచ్చేస్తాను! పురిటిలోనే ఇచ్చేస్తాను!"

"ఇవ్వలేవు! నాకు తెలుసు. మాతృత్వపు మమత అంత తేలికైనదైతే యుగయుగాల నుండి మాతృత్వాన్ని ఇంతగా గానం చేయరు!"

"నేనిస్తానని చెబుతున్నాగా? మీ రెందుకు నమ్మడంలేదు?"

"ఇప్పుడెందుకు వాదం? నువ్వు కన్న తరువాత మాట్లాడదాం!"

లలితకి ఇద్దరు పిల్లలు. పాప, బాబు, ఇప్పుడు మళ్ళీ ప్రసవించే రోజు దగ్గర పడుతూంది.

'లలిత అన్నట్లు పిల్లల సుస్తీలతో, వెంట వెంటనే కాన్పులతో విసుగనిపించినా ఆ పిల్లలున్న ఆనందం తనబోటి గొడ్రాలుకి వస్తుందా?' అనుకొని ఓ నిట్టూర్పు విడిచింది సంధ్య.

ఆ రాత్రి భర్తతో చెప్పింది సంధ్య, లలిత ఈసారి కాన్పులో పుట్టిన పిల్లనో పిల్లాడినో తమకు పెంచుకోడానికి ఇచ్చేస్తాననదని!

"మాటవరసకే అన్నంత మాత్రాన ఇస్తుందా ఏమిటి? ఎంతమందిపుట్టినా తల్లికి పిల్లలమీద మమత పెరుగుతుందే కాని తరగదు. అక్షయపాత్ర ఆమె హృదయం!" అన్నాడు భర్త రామేశం.

"డాక్టరు దగ్గరికి వెళ్ళొచ్చారా?"

"రిజల్ట్ తెలిసిందే! ఇక వెళ్లడం, ఆ వార్తని ఒక శవంలా మోసుకురావడం దేనికి?"

సంధ్య ముఖం మబ్బులు ముసిరినట్టుగా అయింది.

పిల్లలకోసం ఎన్నెన్ని పరీక్షలు? ఎన్నెన్ని మందులు? ఎన్నెన్ని నోములు? ఎన్నెన్ని యాత్రలు! పెళ్ళయిన ఈ పదేళ్ళలో!

జీవితంలో ఒకే ఒక్క కోరిక చిన్ని పాపడిని ఈ చేతులతో ఎత్తుకోవాలనీ, దూదిలా ఉండే వాడి మెత్తటి శరీరాన్ని గుండెలకు హత్తుకొంటూ మాతృమమతతో పులకించి పోవాలనీ.

రామేశ్వరం ఎప్పుడో గుండె రాయి చేసుకొన్నాడు. ఇక తమకు పిల్లలు పుట్టరని సంధ్యకే ఆశ మినుకు మినుకు మంటూంది!

మరుసటిరోజు సంధ్య ఒక్కతే వెళ్ళి డాక్టరుగారిని కలుసుకొంది.

ఆయన రిపోర్ట్ ఉన్న కవరు సంధ్య చేతికిస్తూ, "స్త్రీ మాతృత్వాన్ని ఒక్క తన కడుపు పంటవల్ల మాత్రమే పొందదు! కొంచెం హృదయం విశాలం చేసుకొంటే ఈ ప్రపంచంలో ఉన్న కోట్ల కోట్ల పిల్లలకు తల్లి కాగలదు ఆమె! పిల్లలు పుట్టరని మీరు నిరాశతో కుంగిపోవద్దు! మీ శూన్య గృహాన్ని నవ్వులతో, తుళ్ళింతలతో నింపడానికి ఎందరో పిల్లలున్నారు! మీరు ప్రేమతో ఆహ్వానిస్తే చాలు!" అన్నాడు మందస్వరంతో.

అర్థం చేసుకొన్న సంధ్య రిజల్ట్ గురించి వేరే అడగకుండానే ఇంటికి వచ్చేసింది! మినుకు మినుకు మంటున్న ఆశ ఆరిపోయింది.

ఆ రాత్రి కన్నీళ్ళు కాల్వలు కట్టిన ముఖాన్ని భర్త గుండెల్లో దాచుకొని కుమిలి కుమిలి ఏడ్చింది సంధ్య, చాలా సేపు.

"బాధపడకు సంధ్యా! డాక్టరుగారు చాలామంచి సలహా ఇచ్చారు! దాని గురించి ఆలోచించు! కొంచెం మనసు విశాలం చేసుకొంటే ఈ ప్రపంచంలో పిల్లలకు కొరతేమీ ఉండదు!"

"ఎంతైనా మన రక్తం పంచుకు పుట్టిన పిల్లలతో సమానం వస్తారా?"

"అంతకంటే బలీయమైన బంధమే ఏర్పడుతుందని ఎన్నో కథలు చెబుతాయి మనకు! ఇక మనకు పిల్లలు పుట్టలేదని విచారించేకంటే ఎవరినైనా దత్తత చేసుకొనే విషయం ఆలోచిద్దాం!"

"మా అన్నయ్య ఎప్పుడూ అంటుంటాడు, వాళ్ళ శ్యాంని తీసుకొని పెంచుకొమ్మని! మా అన్నయ్య పిల్లలందరిలో వాడే చాలా చురుకైనవాడు! చక్కటి ముఖకళ ఉన్నవాడు! ఒక్కమాట మనం అడిగామంటే కాదనకుండా ఇచ్చేస్తాడు మా అన్నయ్య!"

"సరే! మంచిరోజు చూసి వెడదాం ఇద్దరం!"

✧ ✧ ✧

సంధ్య అన్నా వదినలు సంతోషంగా ఒప్పుకొన్నారు, వాళ్ళబ్బాయి శ్యామ సుందర్‌ను ఇవ్వడానికి. అయితే ఒక్క షరతుమాత్రం పెట్టారు. రేపు ఏ దేవుడో కరుణించి, ఏ అద్భుతమో జరిగి సంధ్యకే పిల్లలు పుడితే, ఆస్తిలో సగం ముందుగానే తమ కొడుకు పేరుమీద రాయాలన్నారు. తమకి పిల్లలుపుట్టే ఆశ ఎలాగూ లేదు కాబట్టి సంకోచం లేకుండా ఆ షరతుకి ఒప్పుకొన్నారు రామేశం దంపతులు. అయితే, వీళ్ళూ ఒక షరతు పెట్టారు. ఇప్పుడు శ్యాంను వెంట తీసికెళ్ళినా దత్తత మాత్రం

పిల్లవాడు తమకి బాగా అలవాటు అయ్యి, వాడు అన్నివిధాలా తమకి అనుకూలంగా ప్రవర్తిస్తే ఏడాది తరువాత దత్తత తీసుకొంటామని చెప్పారు.

"అనుకూలంగా ప్రవర్తిస్తే అంటే? వాణ్ణి అలవాటు చేసుకోవడంలో ఉంటుంది. వాడి మనసు తెలుసుకొని మాలిమి చేసుకోవడంలో ఉంటుంది!" అంది సంధ్య వదిన.

"మరీ అంత జ్ఞానం తెలియని పిల్లవాడు కాదు కదా వదినా! బాగా ఊహ తెలిసిన పిల్లాడు. వాడి ప్రవర్తన ఎలా ఉంటుందో, అసలు మేమంటే ఇష్టపడతాడో లేదో తీసికెళ్ళి మాతో ఉంచుకొంటే గాని తెలియదు కదా?" అంది సంధ్య.

"తీసికెళ్ళి నడమంత్రాన వెళ్ళగొడతామంటే నేనసలు పంపను! ఇటు అటు కాకుండా అయిపోగలడు పిల్లాడు. మా దగ్గర ఉన్నది కలోగంజో తాగి ఉంటాడు మాతోపాటే!" నిష్కర్షగా చెప్పింది వదినగారు.

"నడమంత్రాన ఎందుకు వెళ్ళగొడతాం వదినా? పిల్లలు లేరనేకదా, పుత్రభిక్షకోసం మీ దగ్గరికి వచ్చింది? ఎలాగో వాడిని మాలిమి చేసుకొంటాం. దత్తత కోసమని తీసికెళ్ళాక ఆ పిల్లాడిపట్ల మాకొక బాధ్యత ఉండదా?"

"ఎవరి బాధ్యతలు వాళ్ళు గుర్తుపెట్టుకొంటే మంచిదే! కాని, నా పిల్లలందరిలో వాడే కొంచెం నాజూకు. తిండి విషయంలోనైతేనేమి, మిగతా విషయాల్లోనైతేనేమి నయాన భయనా చెబితే తిన్నట్టుగా కసిరితే తినడు తీపికూడా పెద్ద ఇష్టంగా తినడు. పాలు తాగుతాడుకాని, పాలమీది మీగడ ఇష్టం ఉండదు. ఫిల్టరులో పోసి ఇవ్వాల్సిందే! ఇహ తిండి దగ్గరా నాజూకే వంకాయ, బెండకాయ, గోంగూర ఇవేవీ తినడు! ఎవరికి మజ్జిగ వేసినా సరేగాని, గరిటెడు పెరుగు వాడికి తీసి ఉంచితేగాని భోజనం దగ్గర మన పరువు నిలబడదు!..." కొడుక్కు ఇష్టమైనవేవో పెద్ద లిస్ట్ చెప్పింది వదినగారు. అప్పగింతలన్నీ అయ్యాక చివరికి అందామె "నా పిల్లాడికి పట్టెడు మెతుకులు పెట్టలేక ఇవ్వడంలేదు నీకు! ఆడపడుచు ఇంటికి వచ్చి అడిగితే కాదనలేక ఇస్తున్నాం. జాగ్రత్తగా కంటికి రెప్పలా చూచుకోండి! అమ్మానాన్నలమీద బెంగ పడకుండా చూడండి!"

చివరి ఘట్టం వచ్చేసరికి ఆవిడ పిల్లాడిని కౌగిలించుకొని గొల్లుమంది, శాశ్వతంగా కొడుక్కి దూరం అవుతున్నట్టుగా.

సంధ్యకి మనసు కలుక్కుమన్నట్టుగా అయింది తల్లీ కొడుకులను ఎడబాపి తీసికెడుతున్నానా అని!

"పిల్లాడిని శాశ్వతంగా పోగొట్టుకొంటున్నట్టుగా ఆ ఏడుపేమిటి? నీకు పిల్లాడిని చూడాలనిపిస్తే వెళ్ళి చూస్తే వాళ్ళు అడ్డగిస్తారా? పిల్లాడిని చదువు కోసం పట్నం పంపుతున్నానని మనసును సరిపెట్టుకో!" అని కసిరాడు సంధ్య అన్నగారు.

"పిల్లాడిని తీసుకొని రామేశం దంపతులు బస్సెక్కుతూంటే ఒక విషాద సన్నివేశం అన్నట్టుగా అందరి హృదయాలూ బరువెక్కి పోయాయి!

'కని ఇన్నాళ్ళు పెంచి ఒకరి చేతికి అందివ్వాలంటే కన్నవాళ్ళకి బాధగానే ఉంటుందిలే!' అని సరిపుచ్చుకొన్నారు రామేశం దంపతులు.

✧ ✧ ✧

వచ్చాక వారం రోజులు సరదాగానే గడిచాయి శ్యాంకు. సినిమాలు, షికార్లు, ఇష్టమైన ఫలహారాలు, పిల్లాడికి బోర్ కొడుతుందేమోనని ఇరుగు పొరుగు పిల్లల్ని పిలిచి మా శ్యాంతో ఆడుకోండి అని చెప్పి వాళ్ళు ఆడుకోడానికి బాట్లూ, బంతులూ కొనిపెట్టింది సంధ్య. వాడికి ఇక్కడ విసుగనిపించకూడదని, ఇంటి మీద మనసు తిరగకూడదని సంధ్య ఎంత జాగ్రత్త పడినా, తాపత్రయ పడినా వాడికి బెంగ ప్రారంభమైంది.

"అత్తా! రేపు మా ఊరెళ్ళిపోతాను! మామయ్య వచ్చి దిగబెడితే సరే! లేకపోతే, నన్ను మా ఊరి బస్సు ఎక్కిస్తే నేనే వెళ్ళిపోతాను!" అన్నాడొక రోజు.

'ఇవాళో రేపో మీ నాన్న సర్టిఫికెట్ తెస్తాడు! బళ్ళో జాయిన్ అవ్వాలి! ఇప్పుడు వెళతానంటావేమిటి?" విస్తుపోయి అడిగింది సంధ్య.

"ఉహుఁ. నేనిక్కడ చదువను! మా ఊరెళ్ళిపోతాను!" వెళ్ళనివ్వరేమో అన్న భయంతో వాడికి దుఃఖం ముంచుకొచ్చింది!

మరీ బిగదీస్తే వాడు అమ్మానాన్నలమీద బెంగపడి జ్వరం తెచ్చుకొంటాడేమోనని భయం వేసింది సంధ్యకు. "సరే! రేపు వెళ్ళి రెండురోజులుండి తిరిగి వచ్చెయ్యి! నువ్విక్కడుంటే బాగా చదువుకోవచ్చు, మంచి మంచి బట్టలు వేసుకోవచ్చు. నీకు క్రికెట్ అంటే ఇష్టంగా! నీకు క్రికెట్ నేర్పడానికి ఒకాయన్ని పిలిచాడు మామయ్య. సైకిల్ నేర్చుకొంటానన్నావు కదా, మామయ్య నీకోసం చిన్న సైకిల్‌కి ఆర్డరిచ్చాడు..."

ఎన్నో ఊరించి, ఊరించి చెప్పి, మరురోజు తమకు తెలిసిన మనిషినిచ్చి పంపింది. అక్కడే రెండు రోజులుండి తిరిగి వెంటబెట్టుకు రమ్మని చెప్పింది.

✧ ✧ ✧

వాడిని తిప్పి పంపడానికి చాలా శ్రమ పడవలసి వచ్చింది అతడి తల్లిదండ్రులకు. ఎన్నెన్నో ఆశలు చూపారు. మేనత్త దగ్గర ఎంత అపురూపంగా పెరగవచ్చో ఊరించారు. అయిదారు లక్షలకు తక్కువ కాని ఆస్తిపరులు! ఇంకా ఇంకా పెరిగే సూచనలేకాని, తరిగే సూచనలు లేవు! రామేశం మంచి కంట్రాక్టర్. పట్టిందల్లా బంగారం అవుతూంది! అంత ఆస్తి తమ పిల్లల్లో ఒకడికి చెందుతుందంటే ఎవరికి ఆశ ఉండదు? తమకి ఆరుమంది సంతానం. ఒకడిని ఇస్తే పెద్దగా పోయేది లేదు! అయినా పిల్లాడు ఎంత దూరం వెడతాడని! బస్సెక్కితే రెండు గంటల ప్రయాణం. చూడాలనిపిస్తే ఇలా వెళ్ళి అలా చూసిరావొచ్చు! బుద్ధిపుడితే పిల్లాడిని చూసుకోవద్దంటారా ఏమిటి?

అలా ఆలోచించి, పట్టుబట్టి పిల్లాడిని పంపించారు.

కాని, సంధ్యకు అక్కడి నుండి కష్టాలు ప్రారంభమయ్యాయి!

వాడిని మాలిమి చేసుకునే ప్రయత్నంలో వాడు కోరిందల్లా సమకూర్చి గారాబం చేయడంతో వాడికి బాగా తల బిరుసుతనం వచ్చేసింది! సినిమాకు వెడతాననగానే వెంటనే డబ్బులిచ్చేయాలి. రెండురోజుల కోసారి పెన్నులు, పెన్సిళ్ళు, పుస్తకాలు పోతాయి! పోయిన కొద్దీ కొని పెట్టాలి! నెలకి ఏభైరూపాయలు ఫీజిచ్చి ట్యూటర్ని పెడితే కూడా నెల పరీక్షల్లో పది, పదిహేను మార్కుల్ని మించడం లేదు!

ఇరుగు పొరుగుల్తో తగవులు తీసుకురావడం ఇత్యాది తలనొప్పులన్నీ ప్రారంభమయ్యాయి.

✧ ✧ ✧

ఆ రోజు సైకిల్ తొక్కడానికి వెళ్ళి నడుం విరగ బడ్డాడు. మోచేతులూ, మోకాళ్ళూ కొట్టుకు పోయాయి! సైకిలేమో షేపు మారిపోగా, వాడి స్నేహితుడు ఇల్లు చేర్చాడు వాడినీ, వాడి సైకిల్నీ!

మందులు, ఇంజక్షన్లు ఇప్పించి హడావిడి చేయడంతో పాటు, పిల్లాడికి ఇన్ని దెబ్బలు తాకితే నాకు కబురు చేయలేదనేమిటని వాళ్లమ్మ దెప్పుతుందని రామేశంతో చెప్పికార్డు రాయించింది సంధ్య.

ఆవిడ మూడో నాటికల్లా దిగింది సకుటుంబ సపరివారంగా.

అప్పటికి వాడికి దెబ్బలు బాగా నొప్పి చేసి జ్వరం కూడా ప్రారంభమైంది. బెడ్ ఎక్కాడు!

"నెలరోజులకే ఎంత చిక్కావురా? ఇక్కడ నీకు తిండి తక్కువైందనుకోనా? సుఖం తక్కువైందనుకోనా? పచ్చడి మెతుకులు తిన్నప్పుడే దిండులా ఉండే వాడివి! ఇప్పుడేమైందిరా నీకు?" అని ఆవిడ కొడుకు ఒళ్ళంతా ఆబగా నిమురుతూ కళ్ళనీళ్ళు పెట్టుకొంటుంటే సంధ్య ముఖంలో జీవం ఊదేసినట్టుగా అయ్యింది.

"కంచం నిండా అన్నం తోడుతుందమ్మా! పారేస్తే కోప్పడుతుందని అంతా బలవంతంగా కుక్కుకొంటే కడుపులో ఒకటే నొప్పి లేస్తుందమ్మా!..." ఉన్నవీ లేనివీ ఏవో చెప్పాడు శ్యాం.

దాంతో సూటిపోటీ మాటలు మొదలు పెట్టింది వదినగారు.

"వాడికి అమ్మవారికి కుంభం తోడినట్టుగా పళ్ళెం నిండా అన్నం తోడితే పసికుంక ఎంతని జీర్ణించుకొంటాడనుకొన్నావు? పెన్నులు పోతే కోప్పడతారట! ఫీజులు అడిగితే కోప్పడతారట! ఇందుకేనా గొప్ప పిల్లాడిని పెంచుకొంటామని తీసుకొచ్చింది. సాకలేక ఇచ్చానా? పిల్లలు లేరని ఏడిస్తే ఇచ్చాగాని, ఆ చేతిలో ఏ మహత్యముందో దుక్కలా ఉండేపిల్లాడు పుల్లలా చిక్కిపోయాడు..."

అన్ని మాటలూ కిక్కురు మనకుండా భరించింది సంధ్య. పరాయి పిల్లాడిని తెచ్చుకొన్న తప్పు తమది. ఇప్పుడు తీసికెళ్ళి పొమ్మంటే, నడమంత్రాన పిల్లాడిని అన్యాయం చేయకడదన్న కండిషన్ ఆవిడ ముందే పెట్టిందాయె.

సంధ్యా వాళ్ళ పని 'మింగలేక కక్కలేక' అన్నట్టుగా అయింది.

ఆవిడ ఉన్న వారం పదిరోజులూ సంధ్య మనసును నిప్పులమీద వేయించినట్టుగానే వేయించి మరీ పోయింది.

"తమ కడుపే పండితే పరాయి వాళ్ళ పిల్లల్ని తీసుకుని ఇన్ని మాటలు పడేది కాదు కదా?" అని కుంగిపోయింది సంధ్య.

'గోరుచుట్టు మీద రోకటి పోటులా' రామేశం అక్కగారు ఊడిపడిందోరోజు! ఆవిడ వస్తూనే శర పరంపర గుప్పిచ్చింది.

"ఆలి తరపు చుట్టాలే ఆత్మ బంధువులన్న సామెత నిజం చేశావన్న మాట. పిల్లల్ని పెంచుకోవాలను కొన్నప్పుడు నీకు రక్త సంబంధం గుర్తు రాలేదు కదూ?

రక్త సంబంధం లేకుండా వాడు నీ ఆస్తికి హక్కుదారు ఎలా అవుతాడు? ఎలా నీ బావ మరిది కొడుకుని దత్తోహం చేసుకొంటావో చూస్తాను!" అంటూ ఆవిడ దీర్ఘం తీసింది.

"నీకున్నది ఇద్దరు కొడుకులే కదా, అక్కయ్యా? ఇస్తావో లేదో అనుకున్నాను" అన్నాడు రామేశం.

"నీకంటే నాకు కావలసిన వాళ్ళెవరున్నారురా? ఒకడినుంచుకుని ఒకడిని నీకిచ్చేదాన్ని!"

సీతారత్నాన్ని శ్యాంకి చేసుకొంటే ఆస్తి ఎవరికో పరాయి వాళ్ళకు పోతుందన్న బాధ నీ కుండదుగా, అక్కయ్యా?"

"నా కూతురు నీ అల్లుడికి వరుస ఎలా అవుతుంది?"

"ఈ కాలంలో వరుసలు వావిళ్ళు ఎవరు చూస్తున్నారు?"

సీతారత్నాన్ని శ్యాంకి చేసుకొనే ఒప్పందం కుదిరాక అక్కగారు కొంచెం శాంతించారు. పెళ్ళి ఇప్పుడు జరగకపోయినా ఒక మంచిరోజున నిశ్చితార్థం చేసి మీ పిల్ల అనిపించుకోండి అని చెప్పి వెళ్ళిపోయింది.

✧ ✧ ✧

ఆ రోజు సాయంత్రం ఆరవుతూన్నా శ్యాం ఇంటికి రాలేదు. బడి ఇవాళ మధ్యాహ్నమే వదిలేశారని పక్కింటి కృష్ణ చెప్పాడు.

సంధ్య కంగారు అంతా ఇంతా కాదు! కాలుగాలిన పిల్లిలా వీధి చివరి వరకూ వెళ్ళి చూసి వస్తూంది, పది నిమిషాలకోసారి.

పని మీద ఆ ఊరికి వచ్చిన సంధ్య బాబాయ్ సుదర్శనం సంధ్య అవస్థంతా చూశాడు. శ్యాంని పెంపకానికి తీసుకుని మింగలేక, కక్కలేక అన్నట్టుగా ఎలా అయ్యారో రాత్రి రామేశం అంతా చెప్పాడు.

"హాయిగా ఉన్న ప్రాణాన్ని చింతల్లోకి తోసుకొన్నావు కదా, సంధ్యా!" అన్నాడు సుదర్శనం.

"ఇప్పుడు పిల్లలు లేకపోయినా కాస్త వయసు మళ్ళాక మమ్మల్ని చూసుకోడానికి ఒకరు కావాలి కదా బాబాయ్! కనకుండా, పెంచకుండా అప్పుడు హఠాత్తుగా ఎవరొచ్చి చూస్తారు మమ్మల్ని?" సంధ్య గాద్గదికంగా అంది.

"నీకు పిల్లలు కావాలంటే ఈ ప్రపంచంలో కరువున్నారా తల్లీ!"

"కరువు లేకపోవచ్చుగాని, పెంచుకొంటామంటే ఎవరిస్తారు, బాబాయ్?"

"అదిగో! అటు చూడు!" ఆయన కిటికీలోంచి పెరట్లోకి చూపాడు.

సంధ్య చూసింది.

నూతి చప్టామీద పనిమనిషి అంట్లుతోముతోంది. నెలలు నిండి కనే రోజులు దగ్గరికి రావడం వల్ల సరిగా కూర్చోలేక చతికిలబడి అతికష్టంగా అంట్లు తోముతూంది.

"కనిపించాడా?"

పక్కనే అన్నం తింటున్నాడు దాని రెండేళ్ళ కొడుకు!

"వాడా? బానపొట్టా, చీమిడిముక్కు ఊసుకళ్ళు! చూస్తూనే డోకొస్తుంది బాబాయ్! వాడిని పెంచుకోమని చెబుతున్నావా?" కంపరంగా అంది సంధ్య.

"వాడు పుడుతూనే అలా లేడు కదమ్మా? సరైన తిండి, పోషణ లేక అలా అయ్యాడు కాని!"

"అబ్బ! వాడిని ముట్టుకోవాలంటేనే అసహ్యమేస్తుంది బాబాయ్! వాడిని నా పెంపుడు కొడుకుగా ఊహించుకోవాలంటేనే మనసులో జలదరింపు పుడుతూంది.

"వాడు కాకపోయినా వాడిలాంటి దీనులు లక్షలు లక్షలున్నారమ్మా మన దేశంలో! వారిలో ఒక్కరికైనా నువ్వు తల్లివై తిండి కరువు తీర్చగలిగితే నువ్వు నిజంగా మాతృదేవివవుతావు! ఈ దేశంలో ఎందరో తల్లిలేని పిల్లలు! వారిలో ఒకరికైనా తల్లిలేని లోటు తీర్చగలిగితే నీ జన్మే ధన్యమైందనుకో! రక్తసంబంధం వాళ్ళనే పెంపుడికి తీసుకొని వాళ్ళకే ఆస్తి కట్టబెట్టాలన్న ఆరాటం ఎందుకు? ఆ ఆరాట ఫలితం చూస్తున్నావు కదా? వాళ్ళొచ్చి నిన్ను తంతున్నారు!"

ఎప్పుడొచ్చాడో, రామేశం అందుకొన్నాడు! "నిజమే మామయ్యా! ఆస్తి వేరేవాళ్ళకు పోతుందన్న ఆశకొద్దీ కొడుకునిచ్చి ఏదో మమ్మల్ని ఉద్ధరించడానికి ఇచ్చినట్టుగా ఫోజు కొడుతూంది వీళ్ళ వదిన! అన్నం ఎక్కువ పెడితే తప్పు, తక్కువ పెడితే తప్పు! వాడు దేనికో ఓదానికి డబ్బులడుగుతాడు. డబ్బులిచ్చి పిల్లవాడిని చెడగొడుతున్నాం అంటుంది. ఇవ్వకపోతే ఇంత పిసినారి మనుషులు పిల్లవాడినెందుకు తెచ్చుకొన్నారు అంటుంది. మామయ్యా నువ్వు చెప్పినట్టు ఏ అనాథ పిల్లాడినో తెచ్చుకొంటే మమ్మల్ని ఏం చేసినా సంజాయిషీ అడిగే వాళ్ళుండరు కదా? పూర్తిగా వాడిమీద అధికారమంతా మాకే ఉంటుంది! వాడికి తన, మన అంటూ ఎవరూ

ఉండరు కాబట్టి వాడి ప్రేమంతా మామీదే ఉంటుంది. నీ సలహా నాకు బాగా నచ్చింది మామయ్యా! రేపే శ్యాం సర్టిఫికెట్‌తీసి పుస్తకాలు, బట్టలు మూటకట్టి వాళ్ళ ఊరు పంపేస్తాను! వాడిని ఉంచుకోవడంవల్ల రోజు రోజుకు చిక్కులు పెరుగుతాయేగాని తరగవు!"

రెండురోజుల తరువాత,

బజారు కంటూ వెళ్ళిన రామేశం రిక్షాలో తిరిగి వచ్చాడు. అతడి చేతుల్లో పాత గుడ్డల్లో చుట్టబడిన అప్పుడే పుట్టిన పసికందు ఉన్నాడు. రిక్షాకు డబ్బులిచ్చి పంపమని సంధ్యకి చెప్పి వాడిని ఇంట్లోకి తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టాడు.

"ఎవరి పిల్లాడండి?" రిక్షా డబ్బు లిచ్చివచ్చి అడిగింది సంధ్య.

"ఎవరి పిల్లాడు కాదు! ఇక నుండి పూర్తిగా మన పిల్లాడే!"

"ఎక్కడి నుండి తీసుకువచ్చారంటె?"

"ఏ తల్లి పక్కలోంచీ ఎత్తుకురాలేదు"

"అబ్బ సస్పెన్స్‌తో చంపక చెబుదురూ!"

"మన పనిమనిషి కొడుకు ఆమె ఉదయం ప్రసవించింది!"

"ఎంత గతిలేనిదైనా తొమ్మిది నెలలు మోసి, కని ఎలా ఇచ్చిందండీ? దాని కన్నపేగు ఎలా ఒప్పింది?"

"రత్తి ఇకలేదు సంధ్యా! ఆమె శ్మశానానికి వెళ్ళగా వీడు మనింటికివచ్చాడు. రత్తి అతి కష్టంగా వీడిని ప్రసవించి కన్ను మూసిందట. ఈ ఉదయం ఇలా జరిగిందని ఎవరో చెబితే నేను వెళ్ళాను గుడిసెకు."

నిజమా? రత్తి చచ్చిపోయిందా?...

నమ్మలేక పోతూంది సంధ్య. నిన్నటి దాకా పనికి వచ్చింది! నిన్ననే చాలా భారంగా కనిపించింది. ఉదయం పనికి రాకపోతే ప్రసవించిందేమో అనుకొంది కూడా!

"పనికి ఎవరినీ పెట్టుకోవద్దమ్మా! అయిదు రోజుల్లో పురుడు కాంగానే పనిలోకి వచ్చేస్తా! ఈ నాలుగు రోజులకోసం మీరు పనిమనిషిని కుదుర్చుకొంటే నా నోట్లో మట్టిపడతది!" అని అది ఇంకా ఆరాటంగా చెబుతున్నట్టుగానే ఉంది.

పాపం! తనే మట్టిలో కలిసిపోతానని తెలియదు దానికి! ఎంత చిత్రం ఈ ప్రపంచం నిన్న ఉన్న మనిషి ఈ రోజు లేదు! నిన్న లేని మనిషి ఈ రోజున్నాడు.

సంధ్యకు ఇంకా నమ్మబుద్ధి కావడం లేదు.

దానికి వరుసగా మీద మీద కాన్పులు! ఈసారి నెల తప్పిందనగానే పిండం పడి పోవాలని తమ దొడ్లో పండిన బొప్పాయి పళ్ళన్నీ తిన్నది. ఏవో నాటు మందులు కూడా మింగింది. ఏం చేసినా ఆ మొండి పిండం పోలేదు!

దాని అవస్థ చూసి, "పడిపోని దాని కోసం ఇంత అవస్థ దేనికే? నువ్వైతే నెలలు మోసి కను, పిల్ల పుట్టినా పిల్లాడు పుట్టినా నేను పెంచుకొంటాను" అందోసారి.

"నెలలు మోసి కన్నాక మనసు ఒప్పదమ్మా!"

"ఇప్పుడు ఇంత నిర్దాక్షిణ్యంగా చంపాలనుకొన్న దానివి! అప్పుడు పెంచుకొంటా నంటే ఇవ్వలేవా?"

"ఇప్పుడేముందమ్మా? కన్నా? ముక్కా? రూపమా? వట్టి రక్తపుముద్ద అది పడిపోతే బాధేముంటుంది?"

వాడు తల్లి కడుపులో ఉండగా తనని హత్య చేయడానికి ప్రయత్నించిందని, బయటికి వస్తూనే తల్లిని చంపి ప్రతీకారం తీర్చుకొన్నాడా?

"తల్లిని చంపినవాడని వాడిమీద అసహ్యం ఏర్పరుచుకొంటూందా?" సంధ్య తన ఆలోచనకు తనే ఉలిక్కిపడింది. అప్పుడే కళ్ళు తెరిచిన పసిగుడ్డుకు ఈ ప్రపంచంలోని రాగద్వేషాలు - ఏం తెలుసు? అంతా విధి లిఖితం! భగవంతుని మాయ!

కొందరికి అంత బలవంతంగా సంతానాన్ని ఎందుకు ఒడిగడతాడో, కొందరికి పిల్లలో పిల్లలో అని అలమటించినా ఎందుకివ్వడో అంతా ఆయన లీల!

బాబు నడుం విల్లులా వంచి ఒళ్ళు విరుచుకున్నాడు. గుప్పిళ్ళు విప్పి మళ్ళీ మూసుకొన్నాడు. తరువాత తన చిన్ని చిన్ని కళ్ళను విప్పి ప్రపంచాన్ని చూసే ప్రయత్నం చేయసాగాడు.

సంధ్య వాడిని అపురూపంగా చేతుల్లోకి తీసుకొంది.

క్షణం ముందు వరకు అంతా వెలితి! ఇప్పుడు అంతా నిండుగా కలకలలాడు తున్నట్టుగా అనిపిస్తూంది!

గోరంతదీపం కొండంత వెలుగు అన్నట్టుగా పాపాయి ఉన్న ఇల్లు నిండుగా ఉంటుంది కదూ! సంధ్య హృదయంలో మమత పులకెత్తగా వాడిని మెత్తగా హత్తుకుంది గుండెలకు!

వాడు పాలకోసం పెదవుల్తో సంధ్య గుండెలమీద తట్టసాగాడు.

సంధ్య మనస్సంతా ఏదో హాయి తీగలా సాగింది.

"పాపం! వీడికి బాగా ఆకలేసినట్టుంది! పాలడబ్బా, సీసా పట్రండి తొందరగా!" ఆత్రంగా చెప్పింది భర్తకు.

అరగంట తరువాత, ఒడిలో బాబును పడుకోబెట్టుకొని, సీసాతో పాలు పడుతున్న సంధ్యను, ఎన్నాళ్ళుగానో తను ఊహించుకొంటున్న దృశ్యాన్ని అప్పుడు చూస్తున్నట్టుగా తన్మయంగా చూడసాగాడు రామేశం!

అతడి మనసు తృప్తితో, ఆనందంతో నిండి పోయింది.

*జ్యోతి మాసపత్రిక, డిసెంబర్ 1986*

◆